ఉచిత కంప్యూటర్ శిక్షణ

విశాలాంధ్ర - భీమిలి: కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ కోచింగ్‌ను ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ప్రారంభించారు. ఈ బ్యాచ్ నందు 40 మంది విద్యార్థినులు జాయిన్ అయ్యారని తెలిపారు. ఇందులో కంప్యూటర్ ఫండమెంటల్స్, ఎమ్మెస్ ఆఫీస్, వర్డ్, పవర్ పాయింట్, ఇంటర్నెట్ కాన్సెప్ట్ తదితర కంప్యూటర్ కోర్సులు ఉంటాయని, ఆసక్తి గల విద్యార్థినులు 9643222666ను సంప్రదించాలని కోరారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

విశాలాంధ్ర - సాగర్‌నగర్: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలను వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేష వస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంక రించి, భక్తులకు దర్శనం కల్పించారు.

సింహాచలం డిపో పరిశీలన

విశాలాంధ్ర - సింహాచలం: విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పల నాయుడు సింహాచలం డిపోను శుక్రవారం సందర్శించి కార్యకలాపాలను పరిశీలించారు. మెకానికల్ సిబ్బంది బస్సుల నిర్వహణకు సంబంధించి గ్యారేజీలో బస్సుల వాషింగ్ కార్యకలాపాలు, టైర్ల నిర్వహణ, హెచ్.ఎస్.డి ఆయిల్ బంక్ పనితీరు గ్యారేజీలో మెకానికల్ సూపర్‌వైజర్లు, మెకానికల్‌తో బహిరంగ సభ నిర్వహించారు. సిబ్బంది, డ్రైవర్లు, నిర్వహణ ప్రమాణాలపై కొన్ని మార్గదర్శకాలను సూచించారు. బస్సుల నిర్వహణ, పని అలవాట్లను మెరుగుపరచడంపై వివరించారు.

పంచగ్రామాల భూ సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ పంచగ్రామాల భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ పంచగ్రామాల కాలనీ అసోసియేషన్‌లు, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కలిసి వినతి అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడలో పంచ గ్రామాల భూ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికా రులతో సమావేశం జరిగిందని, సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.కృష్ణంరాజు, వి.బి.ఎన్.ప్రతాప్, ఉపాధ్యక్షులు బి.శంకర్రావు, హనుమంతురావు, రాము, విజయకుమార్, బాలరాము తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ స్కీమ్ పనుల పరిశీలన

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతులు దర్శించుకున్నారు. వీరికి కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు పూల మాల వేసి ఘన స్వాగతం పలికారు. తొలుత కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని, స్వామివారికి తమ గోత్ర నామాలతో సంకల్పం చేయించారు. పిదప వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈఓ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్ర పటాన్ని, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కమిషనర్ దేవస్థానం పరిసర ప్రాంతాలలో జరుగుతున్న ప్రసాద్ స్కీమ్ పనులపై టూరిజం శాఖ అధికారులు, దేవస్థానం ఈఓ, ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారుతో సమావేశమై వివరాలు తెలుసుకుని పనులను పరిశీలించారు.

సర్పంచ్ చొరవతో రేడియం బస్టాప్ బోర్డులు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో మామిడిలో గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు తన సొంత నిధులతో నాలుగు బస్ స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. చాలా కాలం నుండి అక్కడ బస్ స్టాప్ లేక వాహనదారులు ప్రజలు తరచు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని సమస్యను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సొంత నిధులతో రేడియం బోర్డులు ఏర్పాటు చేశామని, దీనివల్ల రాత్రి వేళల్లో కూడా బస్టాప్ కనిపించే విధంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి జగదీష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విశాఖకు ఐటీ కంపెనీలు ప్రాధాన్యం ఎక్కువ

నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి

విశాలాంధ్ర - సాగర్ నగర్: విశాఖకు ఐటీ కంపెనీల ప్రాధాన్యం ఎక్కువ వుందని నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. ఐటీ సెజ్‌లో పోలీస్ సబ్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ఐటీ సెజ్ ప్రాంతంలో పెనెంట్ కంపెనీ వారు ఏర్పాటు చేసిన పోలీస సబ్ సెంటర్ ప్రారంభించడం జరిగిందని, ఇక్కడ 24 గంటలు కూడా ఇక్కడ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. త్వరలో వైజాగ్‌కు ఐటీ కంపెనీలు వస్తున్నాయని, నగరంలో ప్రజలు తమకు సపోర్ట్ చేస్తున్నారన్నారు. నగరంలో ఎక్కడైనా సరే అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. నగరంలో నేరాలు ఎక్కువ పెందుర్తి స్టేషన్‌లో జరుగుతు న్నాయని, దాదాపు సంవత్సరంలో 1000కు పైగా కేసులు నమోదు అవుతున్నాయన్నారు. కార్ షెడ్, డీ మార్ట్ ప్రాంతాలలో ఎక్కువగా ట్రాఫిక్ ఉంటుందని, ఆ సమయంలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. గత 5 సంవత్సరాలుగా పోలీస్ సిబ్బంది కొరత ఉందని, ప్రతి స్టేషన్‌లో ఎస్ఐల కొరత ఉందన్నారు. బీచ్ ప్రాంతంలో మరింత భద్రత కల్పించనున్నామన్నారు. సీసీ కెమెరాలు అలాగే లైట్లు కోసం జీవీఎంసీ వారితో కూడా సంప్రదిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి 1 అజిత వేజెండ్ల, నార్త్ ఏసీపీ అప్పలరాజు, పలువురు సీఐలు, పోలీస్ అధికారులు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం కొత్తవలస సర్వే నెంబరు 102, 102/2, 103లో వైసీపీ ప్రభుత్వం 225 కోట్లు రూపాయలు విలువైన 15 ఎకరాల భూమిని అతి చౌకగా కేవలం 15 లక్షల రూపాయలకు అధ్యాత్మిక ముసుగులో ఉన్న శారద పీఠానికి కట్టబెట్టిందని, కూటమి ప్రభుత్వం ఆ భూముల కేటాయింపులను రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఆనందపురం మండలం తర్లువాడ సర్వే నెంబరు 1 లో ఉన్నత ప్రమాణాలతో విశ్వ విద్యాలయం ఏర్పాటు చేస్తామని వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తన కుమార్తె పేరున అతి చౌకగా కొట్టేసిన భూమినీ, భీమిలి బీచ్ రోడ్డులో కొట్టేసిన భూమినీ, కొమ్మాది సర్వే నెంబరు 7 లో సత్యం సంస్థ మైటాస్‌కి కేటాయించిన 50 ఎకరాలు భూమినీ, సర్వే నెంబరు 28/2లో కె.శ్రీనివాసరెడ్డి కబ్జా చేసిన భూమినీ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో స్వాధీనం చేసుకొని ప్రభుత్వ, ప్రజా అవసరాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు.

విశాఖ పోర్టులో 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా పోర్టు పరిపాలనా భవనంలో ఆధునీకరించిన బోర్డు రూంను చైర్ పర్సన్ డా ఎం.అంగముత్తు చేతుల మీదుగా ప్రారంభించారు. దీనికి వైజాగ్ పటంగా నామకరణం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్ పర్సన్ దుర్గేష్ కుమార్ దూబె, చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్ఎల్ స్వామి, పోర్టు విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోర్టు చైర్ పర్సన్ పోర్టు పరిసర ప్రాంతాలలో సుందరీకరణ, పచ్చదనాన్ని పెంపొందించే పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఇందులో సీ హార్స్ జంక్షన్ నుంచి ఏవోబి రోడ్డు, కాన్వెంట్ జంక్షన్ నుంచి పిసిఆర్ సర్కిల్ వరకూ ఉన్న ఫ్లైఓవర్ పై భాగం పీసీఆర్ నుంచి షీలా నగర్ వరకూ విస్తరించి ఉన్న ప్రాంతాలు, కాన్వెంట్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ కింద ఉన్న భాగాలలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. 91వ అవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ముందుగా అధికారులు, సిబ్బంది, స్టివె డోర్స్, పిపిపి, బివోటి అపరేటర్లు, యూనియన్ నాయకులకు అవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోర్టులో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పోర్టు సామర్థ్యం, పోర్టులో పర్యావరణ సుస్థిరత కోసం చేపడుతున్న చర్యలు, సాంకేతిక పురోగతి, సామాజిక సేవలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను చైర్ పర్సన్ వివరించారు. ఇక పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా వినియోగిస్తున్న సిఎస్ఆర్ నిధులకు సంబంధించిన విద్యా, ఆరోగ్య రంగాలకు చైర్ పర్సన్ తన చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. శిక్షణను పూర్తిచేసుకున్న సిబ్బందికి సర్టిఫికెట్లు, పెన్షనర్లకు ఐడి కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు హార్బర్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి, పోర్టు ట్రస్టీ బిసిహెచ్ మసేన్, అధికారులు, సిబ్బంది, యూనియన్ నాయకులు, పోర్టు కార్యదర్శి టి.వేణు గోపాల్ పాల్గొన్నారు.

గీతంలో అంతర్జాతీయ సదస్సు ముగింపు

విశాలాంధ్ర - మధురవాడ: ఇండో పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక సమీకరణాలు భద్రత అంశాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యా లయం (న్యూఢిల్లీ) సెంటర్ ఫర్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్, తైవాన్‌కు చెందిన ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. సదస్సులో పాల్గొన్న నిపుణులు అంతర్జాతీయంగా వస్తున్న ఆర్థిక, రాజకీయ పరిణామాలు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వాటి ప్రభావంపై చర్చించారు. తైవాన్‌కు చెందిన ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ అధికారిక ప్రతినిధి రాబర్ట్ హిష్ మాట్లాడుతూ తైవాన్ చిన్న దేశం అయినప్పటికీ విద్య, ఆరోగ్య, వాణిజ్య రంగాలలో ప్రపంచంలో అగ్ర స్థానం ఉందన్నారు. అయితే అంతర్జాతీయ వాణిజ్యంలో తైవాన్ పాత్రను తగ్గించడానికి చైనా ఉద్దేశ్య పూర్వకంగా సమస్యలు సృష్టిస్తోందని పేర్కొన్నారు. ఇతర ప్రపంచ దేశాలతో పాటు భారత్‌తో బలమైన వాణిజ్య సంబంధాలను తైవాన్ కొనసాగిస్తోందన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ మాట్లాడుతూ తైవాన్‌తో భారత్‌కు గల సంబంధాలు భవిష్యత్తులో మరింతగా మెరుగు పడగలవన్నారు. గీతం ఆర్థిక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మందర్ వి.కులకర్ణి మట్లాడుతూ ఆసియా పసిఫిక్ దేశాలు ఆర్థిక అభివృద్ధి కోసం వివిధ కూటమిలలో పనిచేస్తున్నాయని భారత దేశం ఆర్థిక, భద్రత అంశాలను దృష్టిలో పెట్టుకుని అన్ని దేశాలతో వ్యూహాత్మకంగా వ్యవహరి స్తోంద న్నారు. నేషనల్ మేరీటైమ్ ఫౌండేషన్ నిపుణురాలు కె.దీపా బంగాళాఖాతంలో ఆర్థిక, పర్యావరణ అంశాల మధ్య భారతదేశం సమతుల్యత పాటిస్తూ ఆర్థిక శక్తిగా ఎదుగుతోందన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ అల్కాఆచార్య, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.సుష్మరాజ్, దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

రేషన్ డిపోలపై గట్టి నిఘా అవసరం

జేసీ కె.మయూర్ అశోక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రేషన్ దుకాణాల్లో, ఎం.ఎల్.ఎస్. (నిల్వ కేంద్రాలు) పాయింట్లలో విస్తృత తనిఖీలు చేపట్టాలని అవకతవకలకు పాల్పడిన వారిపై 6ఏ కేసులు నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను, తనిఖీ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. రేషన్ సరుకులు దుర్వినియోగం కాకుండా చూడాలని, దారి మళ్లించే వారిపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం ఉదయం ఆయన పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు, తనిఖీ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రేషన్ సరుకుల పంపిణీ, దుకాణాల నిర్వహణ, ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ అందజేత, తనిఖీలు, కేసుల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో బినామీల పేర్లపై కొంతమంది దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, రేషన్ సరుకులు కూడా సమీపంలో ఉన్న హోల్ సేల్ దుకాణాలకు తరలిపోతున్నట్లు పలు పత్రికల్లో ప్రతికూల కథనాలు వస్తున్నాయని దీనిపై కింది స్థాయి అధికా రులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రబ్బర్ స్టాంపుల వినియో గంలో కూడా అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని దీనిపై కూడా దృష్టి సారించాలన్నారు. పక్కాగా తూనికలు చేపట్టిన తర్వాత మాత్రమే గోదాముల నుంచి ఎం.ఎల్.ఎస్. పాయింట్లకు సరుకులు సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎం శ్రీలత, జిల్లా సహాయక పౌర సరఫరాల అధికారి కల్యాణి, ఏఎస్వోలు పాల్గొన్నారు.

రద్దయిన పథకాలు పునరుద్ధరించండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: గత ప్రభుత్వం రద్దు చేసిన 20 సంక్షేమ పథకాలను పునరుద్దరించి మూత పడిన ఎస్సీ కార్పొరేషన్‌ను తెరిపించి రుణాలు మంజూరు చేయాలని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి విదసం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. విశాఖ పర్యటనలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయులు స్వామిని విదసం నేతలు సర్క్యూట్ హౌస్‌లో కలసి పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మంత్రికి సమస్యలు వివరించారు. శారదా పీఠం భూములు వెనక్కి తీసుకున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అన్యాక్రాంతమైన ఎస్సీల అసైన్డ్ భూములు స్వాధీనానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూములు కొనుగోలులో జరిగిన అక్రమాలు సరిదిద్దాలని కోరామన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వమే దళితులపై అట్రాసిటీకి పాల్పడి ఎస్సీల మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, ఎమ్మెల్సీ అనంత బాబుకు మూడు నెలలకే బెయిల్ ఇచ్చి కోడి కత్తి శ్రీనును ఐదేళ్లు జైల్లో పెట్టిందని దళిత బాధితులందరికీ న్యాయం చేయాలని, ఆంధ్రా యూనివర్శిటీ వైస్ చాన్సలర్‌గా అర్హుడైన దళితుడికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఎస్సీ హాస్టళ్లలో శిథిల భవనాలు పున:నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఆహార నాణ్యత పెంచాలని తదితర అంశాలపై వినతి పత్రం ఇచ్చినట్టు వెంకటరావు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అసైన్డ్ భూములు అవకవతవకలపై రెవెన్యూ సదస్సుల్లో బాధితులు వివరాలు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అట్రాసిటీ కేసులపై హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈతలపాక సుజాత, జాజి ఓంకార్, ఎల్లపు సంతోష్, యుఎస్ రాజు, రవి సంతోష్, ఎల్లపు సంతోష్, మూలంపాక అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ఇక్కట్లు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి మల్కాపురం శ్రీహరిపురం కోరమండల్ ప్రాంతాల నుండి నగరానికి వెళ్లే ప్రయాణికులు ములగాడ మీదుగా శ్రావణ్ షిప్పింగ్ పక్కనుండి వెళ్లే మార్గం గుంతల మయంగా మారింది. తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని పలుమార్లు అటు పోర్టు సంస్థకు శ్రావణ్ షిప్పింగ్ యాజమాన్యానికి చెప్పినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ప్రయాణించే భారీ వాహనాల్లో రవాణా చేసే సల్ఫర్ వంటి ద్రావకాలు రోడ్డుపై పడటం వల్ల మార్గం అంతా జారుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ మార్గానికి తగు మరమ్మతులు చేపట్టాలని స్థానికులతో పాటు గ్రామస్తులు కోరుకుంటున్నారు.

ప్రజల పన్నులతో కార్పొరేటర్ల విహార యాత్రలు సరికాదు

విశాలాంధ్ర - విశాఖ: ప్రజలు కడుతున్న పన్నులతో అధ్యయన యాత్రల పేరుతో కార్పొరేటర్లు, అధికారులు విహార యాత్రలు చేయడం వల్ల ఒరిగేదేమీ లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నిబంధనల పేరుతో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు ఇంటి పన్నులు వెయ్యకపోవడం, వారసత్వంగా వచ్చిన ఆస్తులకు ఇంటి పన్నులు వెయ్యకపోవడం, తండ్రి పేరున ఉన్న ఆస్తి పన్ను కొడుకులు పేరున మార్చకపోవడం, 22ఎ లో పెట్టిన భూముల్లో వీఎమ్మార్డీఏ అప్రూవ్ చేసిన లే అవుట్లలో కొనుగోలు చేసుకున్న ఆస్తులకు, పాత యజమాని పేరుతో ఉన్న ఆస్తులు కొనుగోలు చేసుకున్న కొత్త యజమాని పేరున ఇంటి పన్నులు మార్చకపోవడం వల్ల కుటుంబ అవసరాలకు, పిల్లల పెళ్ళిళ్ళకు అమ్ముకోవడానికి వీలుకాక పోవడం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పరిష్కారం చెయ్యడానికి కార్పొరేటర్లు, అధికారులు కృషి చేయాలని కోరారు.

చెత్త పన్ను వసూళ్లు రూ.3 కోట్లు ఏమైయ్యాయి?

ఆస్తి పన్ను విధింపులో జాప్యాన్ని నివారించండి

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

ప్రజలు నుండి వసూలు చేసిన చెత్త పన్ను సుమారు రూ.3 కోట్ల రూపాయలు సౌకర్యంలో వార్డు కార్యదర్శులు జమ చేయకపోతే ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోక పోవడం పలు అనుమానలకు దోహదం చేస్తున్నదని అన్నారు. ఇప్పుడు పత్రికల్లో వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని, ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి అందుకు కారణమైన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు.

రైల్వే జోన్ ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలి

అమరావతికి రైల్వే లైన్ రావడాన్ని సిపిఐ స్వాగతిస్తున్నదని తెలిపారు. ఇప్పటికే కేంద్రం ప్రకటించిన విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటి నుండి ప్రారంభిస్తారో చెప్పాలని కేంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి: సీపీఐ

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసరాల ధరలు ప్రజలకు మోయలేని భారంగా మారాయని సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి షేక్ రెహమాన్, అత్తిలి విమల విమర్శించారు. ఏఎస్ఆర్ నగర్, లక్ష్మీ నగర్, సాయి నగర్ ల్లో డోర్ టు డోర్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు కాయగూరలు, బియ్యం, పప్పు దినుసులు కొనుగోలు చేసి బ్రతుకు జీవనం సాగించలేక ప్రజలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే నియంత్రించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మద్యం ధరలు తగ్గిస్తానని చెప్పి గత ప్రభుత్వం అమ్మిన ధరలకే అమ్ముతోందని అన్నారు. నివాసాలు వద్ద.. ఆరిలోవ, బాలాజీ నగర్ సాయిబాబా గుడి సర్వీస్ రోడ్డు, హెల్త్ సిటీ వద్ద షాపులకు లైసెన్స్ ఇచ్చి విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని, అటువైపు తిరుగుతున్న ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ కల్పించుకొని ఆ రెండు షాపుల్ని అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ సీఎస్ క్షేత్రపాల్, జిల్లా సమితి సభ్యురాలు ఎ.దేవుడమ్మ, ఆరిలోవ ఏరియా కార్యదర్శి కె.లక్ష్మణరావు, సహాయ కార్యదర్శి పీహెచ్.కాసుబాబు, ప్రజానాట్యమండలి బి.చిరంజీవి, ఏ.రవి, పి.పుష్ప, కె.అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ఆటో డ్రైవర్లకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ తూర్పు నియోజకవర్గం ఎంవీపీ డబుల్ రోడ్డు గాయత్రీ కాలేజ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గ ఆటో స్టాండ్‌ను శుక్రవారం ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ ప్రారంభించారు. అనంతరం డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ విశాఖలో ఎన్నో ఏళ్లుగా నగరంలో పార్కింగ్ స్థలాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఆటోలో పాసింజర్ని ఎక్కించాలన్నా, వారి గమ్య స్థలాలకు చేర్చాలన్న పోలీస్ వారు రాంగ్ పార్కింగ్ అని 1035 జరిమానాలు విధిస్తూ ఈ- చలానాలు రూపంలో ఫోన్లకు మెసేజ్‌లు పంపిస్తున్నారని, డ్రైవర్లు ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తేవాలని, పోరాడితే తప్ప సమస్య పరిష్కారం కాదని సూచించారు. డ్రైవర్లు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని, విధిగా ఖాకీ చొక్కా ధరించాలని, మందు త్రాగి వాహనం నడపరాదని, ఆటోలో పరిమితికి మించి పాసింజర్లను ఎక్కించరాదని, ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని, ప్రధానమైన ఆటో డ్రైవర్ల సంక్షేమ చట్టం అమలుకై డ్రైవర్ల అందరూ పోరాటానికి సిద్ధమవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవి, శేషుబాబు, సూరిరెడ్డి, తదితర డ్రైవర్లు పాల్గొన్నారు.

విశాఖ వేదికగా నేటి నుంచి రంజీ మ్యాచ్

- హిమాచల్‌ప్రదేశ్‌తో తలపడనున్న ఆంధ్ర జట్టు

విశాలాంధ్ర - పీఎం పాలెం: రంజీ ట్రోఫీ మ్యాచ్ శనివారం నుంచి విశాఖపట్నం పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రారంభం కానుంది. 29వ తేదీ వరకు రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న మ్యాచ్‌ల్లో ఆంధ్ర జట్టు హిమాచల్‌ప్రదేశ్ జట్టుతో తలపడనుంది. మ్యాచ్ నిర్వహణకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం సెషన్‌లో ఆంధ్ర, మధ్యాహ్నం సెషన్‌లో హిమాచల్‌ప్రదేశ్ జట్లు నెట్స్‌లో ప్రాక్టీసు చేశాయి. ఆంధ్రజట్టు కెప్టెన్ ఎస్.కె.రషీద్, టి.విజయ్, కె.ఎస్.భరత్, జి.హెచ్.విహారి, కె.మహీప్ కుమార్, ఎం.వంశీకృష్ణ, ఎం.అభిషేక్‌రెడ్డి, కె.వి.శశికాంత్, అశ్విన్ హెబ్బర్, సీహెచ్ స్టీఫెన్, వి.సత్య నారాయణ రాజు, ఎ.లలిత్‌మోహన్, జి.మనీష్, ఎం.హేమంత్‌రెడ్డి, ఎస్.ఎం.డి.రఫీ, కె.కరణ్ షిండే తదితరులు జిమ్‌లో ముమ్మరంగా సాధన చేశారు. ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న రంజీ మ్యాచ్‌లను తిలకించేందుకు క్రికెట్ అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్టేడియం వద్ద 15వ నంబర్ గేట్ నుంచి ఉచిత ప్రవేశం ఉంటుందని ఉదయం 8 గంటల నుంచి స్టేడియంలోకి అనుమతిస్తారన్నారు.

IN THE HONOURABLE COURT OF THE V ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM

O.S.801/2022

Between:
Sri. Duvvi Yerrayya Reddy
.....Plaintiff

And:
1.Smt.Gudivada Navaratnam (Died)
2.Sri.Gudivada John Joseph, s/o late Babu Rao, aged 58 years, Residing at D.No.9-17-26, Opp: Amulya Enclave, CBM compound Visakhapatnam - 530003.
3.Smt.Adwin, aged 48 years, w/o late Gudivada Vijay Ratnam Kumar (2nd son of Defendant) s/o late Gudivada Babu Rao, aged 48 years, Residing at c/o Joseph (adwin brother) D.No. 9-15-1, Flat No16, Prinice Apartments-13, Opp: ,Shoppers stop lane, CBM compound, Visakhapatnam - 530003.
4.Sri. Gudivada Nickoles, s/o G.Babu rao, aged 52 years, Residing at D.No .9-41-21, Pithapuram colony, Andhra bank Lane, Visakhapatnam-530003.
5.Smt. Jyothi Baid, w/o Baid Charitra Kumar, D/o late G.Babu Rao, aged 49 years, Residing at D.No.53-13-2, Resapuvanipalem, Opp: Swarna bharathi Indoor Stadium, Visakhapatnam - 530013.
(Defendants 2 to 5 added in the Plaint as Legal Heirs in I.A.142 /2023 on 4-3-2024 pleased and allowed by the Honourable Court)
.....Defendant's

నోటీసు

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పై వ్యాజ్యంలో సదరు ప్రతివాదులు తేదీ 05/11/2024న ఉదయం 10.30 గంటలకు సదరు కోర్టులో స్వయంగా గాని, ఏజెంట్ ద్వారా గాని వకీల్ ద్వారా గానిహాజరు కావాల్సిందిగా కోరుతున్నాము. లేని యెడల సదరు దావా మీ పరోక్షంలో తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు
జి.శివప్రసాద్, అడ్వకేట్
విశాఖపట్నం: ఫోన్ 8688884963

చీటీల పేరుతో మోసం: భార్యాభర్తలు అరెస్టు

విశాలాంధ్ర - భీమిలి: చీటీల పేరుతో పలువురు మహిళలను మోసం చేసిన దంపతులను అరెస్ట్ చేసినట్లు భీమునిపట్నం పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం తగరపువలస సత్యనారాయణ పేటకు చెందిన భార్య భర్తలు వంగపండు రోజా(43), ఆమె భర్త శ్రీనివాసరావు, వంగపండు శ్రీనివాసరావు(50) మూడు సంవత్సరాలు క్రితం మండలంలోని చిప్పాడ, తదితర ప్రాంతాల్లో ఉన్న మహిళలకూ అధిక వడ్డీ ఆశ చూపడమే కాకుండా, చీటీల పేరుతో ఆకట్టుకుని డబ్బులు కట్టించుకున్నారు. కాగా మూడు సంవత్సరాలు అయినా కూడాఇంతవరకు వారి డబ్బులు చెల్లించకపోవడంతో విసుగు చెందిన చిప్పాడ గ్రామానికి చెందిన కొసన సత్యవతి భీమునిపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సి.ఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆ దంపతులు ఆచూకీ కోసం గాలించి ఎట్టకేలకు వారిని గురువారం అరెస్టు చేసి విశాఖ సెంటర్ జైలుకు తరలించినట్లు భీమిలి పోలీసులు తెలిపారు. అంతేకాకుండా వీరి చేతుల్లో మోసపోయిన మరో 20 మంది మహిళలు భీమిలి పోలీస్ స్టేషన్లో

ఫిర్యాదు చేసారు. అధిక వడ్డీలు చీటీలు ఇస్తామని ఆశ చూపించి ఎంతో మందిని నమ్మించి మోసం చేసిన వీరి వద్ద కోటి19లక్షల48వేల రూపాయలు విలువచేసే ఆస్తులను సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. ఈ కేసును భీమిలి సిఐ సుధాకర్ దర్యాప్తు చేస్తున్నారు.

27న జీ తెలుగులో డబుల్ ఇస్మార్ట్

విశాలాంధ్ర - విశాఖపట్నం: జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన మాస్‌ఎంటర్టైనర్ 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను ఈ వారం వరల్డ్ టెలివిజన్ప్రీమియర్‌గా అందిస్తోందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన కథ, కథనంతో పాటు పూరీ జగన్నాథ్ డైరెక్షన్, రామ్ నట విశ్వరూపం తో డబుల్ ఇస్మార్ట్,ఈ నెల 27న సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కథ అంతర్జాతీయ మాఫియా డాన్ బిగ్ బుల్ (సంజయ్ దత్) చుట్టూ తిరుగుతుందన్నారు. అతని జ్ఞాపకశక్తిని మరొకరి మెదడుకు బదిలీ చేయడం వల్ల అతను అమరుడవుతాడని ఒక శాస్త్రవేత్త సూచించడంతో అందుకు సరిపోయే వ్యక్తి కోసం అన్వేషణ మొదలవుతుందన్నారు. ఆ అన్వేషణలో హైదరాబాద్‌లోని శంకర్ (రామ్ పోతినేని)సరైన వ్యక్తిగా గుర్తించడంతో బిగ్ బుల్ మెమరీ ట్రాన్స్ ఫర్ జరుగుతుందన్నారు.ఆ తర్వాత ఏం జరుగుతుందనే విషయం తెలియాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే డబుల్ ఇస్మార్ట్ సినిమా చూడాల్సిందే అన్నారు. రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన ఈ సినిమాలో సంజయ్ దత్, గెటప్ శ్రీను, అలీ, షాయాజీ షిండే, ఝాన్సీ వంటి నటులు కీలక పాత్రలు పోషించారన్నారు. యాక్షన్, కామెడీ, థ్రిల్లింగ్ కాన్సెప్ట్తో రూపొందిన ఈ మాస్‌ఎంటర్టైనర్ని జీ తెలుగు వేదికగా ఈ నెల 27న మీరు తప్పకుండా చూడాలన్నారు.

అవంతి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - భీమిలి: తగరపువలస అవంతి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆంధ్రా యూనివర్సిటీ రెక్టార్ కిషోర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కోర్సు చదివితేనే ఏదో సాధించినట్లు కాదనీ, మిగతా విషయాలైన ఆటలు, కంప్యూటర్ తదితర వాటిపై కూడా అవగాహన కలిగి ఉండాలనీ అన్నారు. డిగ్రీ విద్యార్థులు టెక్నికల్ స్కిల్, హ్యూమన్ స్కిల్, కాన్సెప్ట్ స్కిల్, డిజైన్ స్కిల్, మేనేజ్మెంట్ స్కిల్, క్రియేటివ్ స్కిల్, కమ్యూనికేషన్ స్కిల్ కలిగి ఉంటేనే సక్సెస్ అవుతారనీ అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ తప్పనిసరి అనీ, క్రమశిక్షణ కలిగి ఉంటే ఏ రంగంలోనైనా అభివృద్ధి చెందగలరనీ అన్నారు. అంతేకాకుండా క్లాసులో లెక్చరర్‌లు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినలనీ,ఒకవేళ అర్థం కాకపోతే అడిగి తెలుసుకోవాలని తెలిపారు. చదువు పట్ల నిర్లక్ష్యం వద్దని, ప్రతీ ఒక్కరూ చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అందుకోవాలని చెప్పారు. అంతేకాకుండా సీనియర్ విద్యార్థులతో మంచి స్నేహబంధం ఏర్పాటు చేసుకొని మనకు తెలియని విషయాలు తెలుసుకోవాలని చెప్పారు. కష్టపడితేనే మంచిఫలితం ఉంటుందని, అందువలన ప్రతి ఒక్కరూ కష్టపడి చదివాలని అన్నారు. అనంతరం ఆటల పోటీలో పాల్గొన్న విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బాణాసంచా అమ్మకానికి అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర పద్మనాభం: బాణాసంచా అమ్మకానికి అనుమతులు తప్పనిసరి అని పద్మనాభం మండలం స్థానిక పోలీస్ స్టేషన్ సిఐ శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలములోని దీపావళి పండగ సందర్భంగా బాణాసంచా అమ్మాలనుకునే వ్యాపారస్తులు అనుమతులు తప్పనిసరి అని తెలియజేశారు. మందుగుండు సామాన్లు

అమ్మాలనుకునే వ్యాపారస్తులు ముందుగా స్థలం యజమాని అనుమతి, పంచాయతీ కార్యాలయం నుంచి అనుమతి, ఫైర్ అండ్ సేఫ్టీ వారి నుంచి అనుమతి తీసుకున్న వారికి ఈ వ్యాపారం చేసుకోవడానికి అనుమతి ఇస్తామని అన్నారు. అక్రమంగా ఎవరైనా సరే ఈ మందుగుండు సామాన్లు విక్రయించినట్లయితే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని తెలియజేశారు.

పశుగణనకు పాడి రైతులు సహకరించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: పశు గణన సర్వేకు పాడి రైతులు సహకరించి వివరాలను తెలపాలని ఆనందపురం మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. ఫిబ్రవరి 28 వరకు పశుగణన సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామానికి పశు వైద్య సిబ్బంది వచ్చి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. పశు గణన సర్వే ప్రకారం ఎన్ని పశువులు ఉన్నాయి వాటికి కావలసిన

మందులు దానా తదితర, వాటిపై ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ రైతులు అందరూ సర్వేకు సహకరించాలని ఈ మేరకు చందక గ్రామంలో శుక్రవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. చందక పంచాయతీలో 100 ఇండ్లు సర్వే చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసవర్ధశాఖ సిబ్బంది సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పది నిమిషాల డెలివరీతో బిగ్‌బాస్కెట్

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఫుల్ స్టాక్ త్వరిత వాణిజ్య సంస్థగా మారుతోన్న బిగ్‌బాస్కెట్ , తమ కస్టమర్ల ఇంటి ముంగిటకు కేవలం కిరాణా సామాగ్రిని మాత్రమే కాకుండా మరిన్నింటిని తీసుకువస్తోంది. ఈ మార్పు టైర్ 2 మార్కెట్‌లలో శీఘ్ర వాణిజ్య ఆఫర్‌లను విస్తరించడంలో బిగ్‌బాస్కెట్ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుంది, ఇక్కడ కస్టమర్‌లు వీలైనంత తక్కువ సమయంలో అగ్ర శ్రేణి బ్రాండ్‌ల నుండి నాణ్యమైన ఉత్పత్తులను విస్తృతంగా సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నారు. దీపావళి సమీపిస్తున్నందున, కస్టమర్‌లకు అద్భుతమైన రీతిలో వివిధ రకాల ఉత్పత్తులను అందించడం ద్వారా పండుగ సీజన్‌ను మరింత వైభవంగా జరుపుకోవడానికి, కేవలం 10 నిమిషాల్లోనే వస్తువులను డెలివరీ చేస్తుంది. రాబోయే నెలల్లో క్రోమా నుండి సరికొత్త ఎలక్ట్రానిక్స్ మరియు గృహోపకరణాల వరకు, మాటెల్, హాస్బ్రో, లెగో మరియు బే బ్లేడ్ వంటి బ్రాండ్‌ల బొమ్మలు, అలాగే టాటా క్లిక్ నుండి దుస్తులు వంటివి అందించటానికి బిగ్‌బాస్కెట్ సిద్ధంగా ఉంది. దీని గురించి బిబి రిటైల్ మార్కెటింగ్ హెడ్ రాగాలీన శ్రీపాద వివరించారు.

99% మంది భారతీయ వ్యాపారులకు జెనరేటివ్ ఏఐపై ఆసక్తి

విశాలాంధ్ర/విశాఖపట్నం: వచ్చే రోజుల్లో ఏఐ వ్యాపార విజయానికి దోహద పడుతుంది అనే బలమైన ఏకాభిప్రాయాన్ని సుమారు 300 మంది సి సూట్ నాయకులు సేల్స్ ఫోర్స్ సర్వేలో కనుగొన్నారు. ఆకట్టుకునే 99% మంది ప్రతివాదులు ఉత్పాదక ఏఐని ఒక ముఖ్యమైన అంశంగా గుర్తించారు. ఇది భారతీయ కార్పొరేట్ ల్యాండ్‌స్కేప్‌లో ఏ ఐ ఆధారిత పరివర్తన వైపు ప్రధాన మార్పును హైలైట్ చేస్తుంది. పెద్ద సంస్థల నుంచి వచ్చిన 60% నాయకులు ఇప్పటికే బాగా నిర్వచించిన జెనరేటివ్ ఏఐ వ్యూహం ఉంది. వాటిలో 32% ఎదిగే దశలో ఉన్నాయి. ఈ ఎదుగుతున్న నిబద్ధత అత్యవసర వ్యాపారాయాలను జెనరేటివ్ ఏఐకి అందిస్తూ ఏఐ టెక్నాలజీలను పోటీగా ఉండేలా చేస్తుంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, 73% మంది సి-సూట్ ఉద్యోగులు పనిలో జనరేటివ్ ఏఐ సాధనాలను క్రమం తప్పకుండా ఉపయోగిస్తున్నారని నివేదించారు. దత్తత విస్తృతంగా ఉన్నప్పటికీ, ఉత్పాదక ఏఐ పూర్తి సామర్థ్యాన్ని తెలియజేయడానికి ఈ అడ్డంకులను పరిష్కరించడం చాలా కీలకమని సూచిస్తుంది.

కాలువలను శుభ్రపరిచిన పారిశుధ్య కార్మికులు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సి ఎస్ బి బ్యాంక్ వద్ద శుక్రవారం ఉదయం గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుద్ధ పనులు చేపట్టి, కాలువను శుభ్రపరిచారు. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అనే విశాలాంధ్ర కథనంపై గ్రామపంచాయతీ

అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టారు. బీపీ కల్లాల రోడ్లో షాపులు సమీపంలో శుభ్రం చేశారు కానీ, ఇది ప్రధానమైన సమస్య చాలా కాలం నుండి ఈ సమస్య అలాగే ఉండిపోయిందని నీరు పోయే విధంగా తగిన చర్యలు ఏ అధికారులు నాయకులు చేపట్టలేదని గ్రామస్తులు షాపు యజమానులు పేర్కొన్నారు. పారిశుధ్య పనులతో పాటు నీరు పోయే విధంగా చర్యలు చేపట్టి పూర్తిస్థాయిలో నివారణ పనులు చేపట్టి సమస్యను పరిష్కారం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శారదా పీఠం అక్రమాలను అడ్డుకుంటాం

విశాలాంధ్ర - విశాఖపట్నం: చిన ముషిడివాడలోని శారదా పీఠానికి మరో ఎదురు దెబ్బ తగిలిందని, పీఠానికి చెందిన సుమారు 20 సెంట్లు భూమి గడ్డ స్థలంలో ఉందని పెందుర్తి ఎంఆర్ఓ ఎం.ఆనంద్ కుమార్ ప్రకటించారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ చెప్పారు. తాను చేసిన ఫిర్యాదు ప్రకారం రికార్డులను పరిశీలించిన అనంతరం శారదా పీఠానికి చెందిన కొంత భూమి గడ్డ స్థలంలో ఉందన్నారు. శారదా పీఠం భూమి గడ్డలో ఉందని ఎమ్మార్వో ప్రకటించిన నేపథ్యంలో బి.వి.రామ్ మీడియాతో మాట్లాడుతూ.. శారదా పీఠం అక్రమాలపై మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలుస్తానన్నారు. శారదా పీఠంతో పాటు రాష్ట్రంలో ప్రభుత్వ భూమి ఎక్కడ కూడా అన్యాక్రాంతం కాకూడదని తెలుగు శక్తి ప్రధాన ఉద్దేశం అన్నారు.

కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు

- రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ డోలా బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుం దన్నారు. విశాఖతో తనకు అనుబంధం ఉందని, ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ చదువుకున్నానని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో విధ్వంసకర పాలన జరిగింది. నాయకులు విశాఖను దోచుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి అంశాన్ని తూచా తప్పకుండా అమలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి గత ఐదు సంవత్సరాల లో పంచాయతీలకు ఒక్క రూపాయి నిధులు ఇవ్వక సర్పంచ్ ల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి రానున్న ఎన్నికలలో ఇప్పుడు వచ్చిన 11 సీట్లు కూడా రావని జోష్యం చెప్పారు. తల్లికి చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి ఆడపిల్లల కోసం మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. విశాఖ అభివృద్ధి కి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకమైన ఆంధ్రా విశ్వవిద్యాలయంలో రాజకీయాలు చేసి భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు.

దోపిడీదారుడు విజయసాయిరెడ్డి
టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విజయ్ సాయి రెడ్డి దోపిడీదారుడని గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. మూడేళ్ల పాటు విశాఖను దోచుకొని తిరిగి విశాఖకు ఆ పార్టీ ఇన్చార్జిగా వచ్చారన్నారు. నమినేటెడ్ పదవులు త్వరలో భర్తీ చేస్తామని, గత ఐదు సంవత్సరాలు కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటు ందని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు విశాఖ స్టీల్ ప్లాంట్ జీవనాడి లాంటిది. ఉక్కు పరిశ్రమను పరిరక్షించవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కూటమి ధర్మాన్ని పాటించుకుంటూ అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామన్నారు. ఇంట్లో ఉన్న సమస్యలే పరిష్కరించలేకపోతున్న జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర సమస్యలను ఏం పరిష్కరిస్తారని ఎద్దేవా చేశారు. ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ కూటమి ధర్మాన్ని పాటిస్తూ నాయకులందరం ముందుకు వెళ్దామన్నారు. విశాఖ ఇంచార్జ్ మంత్రిగా డోలా బాల వీరంజనేయ స్వామి రావడం సంతోషకరమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టి సి ఎస్ ను తీసుకువచ్చామన్నారు. విశాఖలో రాత్రి 12 గంటలు వరకు హోటల్స్ తెరిచి ఉండేలా అనుమతులు తీసుకువచ్చామన్నారు. సమావేశంలో శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, గణబాబు, పంచకర్ల రమేష్ బాబు, శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు వేపాడ చిరంజీవిరావు తదితరులు మాట్లాడారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, సీతంరాజు సుధాకర్, జనసేన నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, వలిసెట్టి తాతాజీ, పట్టాభి డాక్టర్ రఘు, జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, ఈతలపాక సుజాత, బిజెపి నాయకులు కాశిరాజు, నాగేంద్ర, కార్పొరేటర్లు తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

27న బీచ్ లో "విక్టరీ ఎట్ సి" స్థూపంపై లేజర్ షో

జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద్ రాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా అక్టోబర్ 27 (ఆదివారం) సాయంత్రం 7 గంటల నుండి బీచ్ రోడ్డులో వైఎంసిఏ సమీపాన గల "విక్టరీ ఎట్ సీ" స్థూపముపై సౌండ్, లేజర్ ప్రదర్శన జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ప్రజల వీక్షణ కొరకు నిర్వహించడం జరుగుతుందని జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద్ రాజు తెలియజేశారు. ఈ లేజర్ షోలో 1971 నౌకాదళం యుద్ధం మరియు విశాఖ నగరం యొక్క పాత్ర, యుద్ధ వీరుల సాహసాల తో పాటు దేశ చరిత్ర ను తెలిపే విధంగా అద్భుతమైన లేజర్ షో నిర్వహించడం జరుగునన్నారు. ఇప్పటికే సెప్టెంబర్ రెండవ తేదీన ట్రయల్ రన్ గా "విక్టరీ ఎట్ సి" స్తూపంపై ఈ లేజర్ షో ను ప్రదర్శించడం జరిగిందని, ఇకపై ప్రతి ఆదివారం ప్రజల వీక్షనార్థం ప్రదర్శించడం జరుగుతుందని ప్రధాన ఇంజనీర్ తెలిపారు. అక్టోబర్ 27, 2024 ఆదివారం సాయంత్రం 7 గంటలకు బీచ్ రోడ్డులో వైఎంసిఏ సమీపానగల విక్టరీ ఎట్ సీ స్థూపం పై ఈ లేజర్ షోను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ప్రజలందరూ ఈ అద్భుతమైన ప్రదర్శనను తిలకించవలసినది గా జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారని అన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా

నూతన మార్గాలను అన్వేషించండి

అనకాపల్లి మాదిరిగా నూతన నిర్మాణం చేపట్టండి
రెండు మార్కెట్లను ఉపయోగంలో తీసుకోండి
శ్రీ ఉషా విద్యానికేతన్ కరస్పాండెంట్ చందక పాండురంగ డిమాండ్

విశాలాంధ్ర - ఆనందపురం: నిత్యం వాహనాల రాకపోకలతో ఆనందపురం జంక్షన్‌లో నిరంతర ట్రాఫిక్‌తో ప్రజలు, వాహనదారులు నిత్యం బెంబేలు ఎత్తిపోతున్నారని, వాహనాలు రాకపోకలకు, సరైన మార్గాలు లేక నిరంతరం ట్రాఫిక్ సమస్యతో కొట్టుమిట్టాడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శ్రీ ఉషా విద్యానికేతన్ కరస్పాండెంట్ చందక పాండురంగ అన్నారు. అనేకమార్లు నేషనల్ హైవే అధికారులకి జిల్లా కలెక్టర్ పలువురు అధికారులకు ఈ సమస్యపై ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోయిందని, నిత్య వాహన రాకపోకల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతుండడం ట్రాఫిక్ పోలీసులు ఎంత నియంత్రించినప్పటికీ పూర్తిస్థాయి లాభం లేకపోవడం తరచూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేములవలస జంక్షన్‌లో మహాత్మా గాంధీ డైలీ పువ్వులు మార్కెట్ ఉత్తరాంధ్రకే పెద్ద మార్కెట్‌గా చెప్పవచ్చు అని నిత్యం రద్దీ వలన ప్రజలకు రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రజలకు వాహందారులకు నిత్యం ఇబ్బందుల గురవుతున్నారని, పువ్వులు, కాయగూరలు రోడ్డుకు ఇరువైపులా ఉండడం వ్యాపారస్తులు క్రయవిక్రయాలు నిత్యం ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతుం దన్నారు. ఆటోలు, ఆర్టీసీ బస్సుల వల్ల వాహనదారులు తరచూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మార్కెట్ నుండి వచ్చే వాహనాలు నేషనల్ హైవే నుంచి వెళ్లే వాహనాల వలన కూడా ఇబ్బందులు పడుతున్నామని అందువల్ల మండలంలో చుట్టుపక్కల 14 గ్రామాల నుంచి వచ్చే వాహనాలకు సపరేట్ రూటు ఏర్పాటు చేయాలని, అలాగే నిత్యం మార్కెట్ రహదారిని సింగల్ లైన్ ఏర్పాటు చేయాలని, నేషనల్ హైవే నుండి వెళ్లే వాహనాలను రూట్ ఏర్పాటు చేయాలలన్నారు. విశాఖ నుంచి

వస్తున్న వాహనాలకు విజయనగరం శ్రీకాకుళం వెళ్లే రహదారిని వాహనాలకు ప్రత్యామ్నాయ, ఫ్లై ఓవర్ విస్తీర్ణం పెంచి రహదారులు ఏర్పాటు చేసి వాహనాలకు విముక్తి కల్పించాలని, నిత్యం మార్కెట్ రద్దీ ఎక్కువ అవడం వల్ల ప్రక్కనే ఖాళీగా ఉన్న మార్కెట్ యార్డ్‌ను వినియోగించుకోవాలని, అప్పుడే కొంతమేర ట్రాఫిక్ సమస్య నుంచి కలగవచ్చు అని వాహనదారులకు పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు నిర్ణీత సమయంలో గమ్యస్థానాలకు చేరుకోవడానికి అవకాశం ఉంటుందని వాహనదారులు వెంటనే అనకాపల్లి స్థాయిలో ఫ్లై ఓవర్ ఏర్పాటు చేసి వాహనదారులకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని శ్రీ ఉషా విద్యానికేతన్ కరస్పాండెంట్ చందక పాండురంగ పలువురు అధికారులను విజ్ఞప్తి చేశారు.

విశాఖ ఖ్యాతిని మరింత పెంచేలా అభివృద్ధి ప్రణాళికలు

ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ ఖ్యాతిని మరింత పెంచేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, సరైన కార్యాచరణతో ముందుకెళ్లాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఇన్చార్జి మంత్రి విశాఖపట్టణం జిల్లా అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా, రూల్ పొజిషన్ ప్రకారం పని చేసే అధికారులకు మద్దతుగా ఉంటామని చెప్పిన ఎంపీ శ్రీభరత్ మాటలను సమర్ధిస్తూ మంత్రి హామీ ఇచ్చారు. ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎక్కువగా సైక్లోన్లు వచ్చే ప్రాంతం కాబట్టి విశాఖ మహా నగరం పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లాలోని చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి, జిల్లా స్థితిగతుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రజెంటేషన్ ఇస్తూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు వినూత్న చర్యలు చేపడుతున్నామని, దానిలో భాగంగా గస్తీ పెంచామని, డ్రోన్లను వినియోగిస్తున్నామని చెప్పారు. సాకేంతిక పరిజ్ఞానం సాయంతో సైబర్ నేరాలను అదుపు చేశామని, చాలా అంశాల్లో మంచి ఫలితాలు సాధించామని వివరించారు. వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ మాస్టర్ ప్లాన్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

పలు సమస్యలను నివేదించిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు...

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ పరిపాలనాపరమైన అంశాల్లో అధికారులు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని, కాలయాపన చేయరాదని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేసే అధికారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యాక్టివ్ గా ఉండే ఉద్యోగులకు ప్రోత్సాహం, డల్ గా ఉండే ఉద్యోగులకు పనిష్మెంటు ఉంటుందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇలాంటి వారిపై ప్రత్యేక పరిశీలన, చర్యలు ఉండాలని కలెక్టర్‌కు సూచించారు. రుషికొండ సమీపంలోని కొత్తగా వేసిన రోడ్డును ఓపెన్ చేయాలని మంత్రిని కోరారు. దీని వల్ల పర్యాటకం పెరుగుతుందని పేర్కొన్నారు. గాజువాక ప్రాంతంలో కన్వెన్షన్ డీడ్, 22ఏ భూముల విషయంలో సడలింపులు ఇవ్వాల్సి ఉందని స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రస్తావించారు. గంగవరం పోర్టు నిర్వాసితులకు పరిహారం, ఉద్యోగాల కల్పన గురించి చెప్పారు. పంచవటి భూస్వాములకు పరిహారం, ఇళ్ల పట్టాల మంజూరు, నిర్మాణాల విషయంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, దానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు సూచించారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ నావల్ డాక్ యార్డులో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉద్యోగులకు కల్పించాలని కోరారు. నగరంలో హోల్ సేల్ మార్కెట్ ను ఏర్పాటు చేయాలని, అనువైన స్థలం కేటాయించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ కోరారు. ప్రజాప్రతినిధుల రిఫరెన్సును పరిగణలోకి తీసుకోవాలని, అధికారులు త్వరితగతిన స్పందించాలని ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవి రావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాథుర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ హెల్త్ నుంచి మెడికేషన్స్ ప్రకటించిన సామ్‌సంగ్

విశాలాంధ్ర- విశాఖపట్నం: వినియోగదారులు తమ ఆరోగ్యాన్ని మరింత సమగ్రంగా నిర్వహించడంలో సహాయపడటానికి వీలుగాసామ్‌సంగ్ హెల్త్ యాప్2 నకు మెడికేషన్స్ ట్రాకింగ్ ఫీచర్1ని జోడించినట్లు భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్ ప్రకటించింది. ఈ ఫీచర్ వినియోగదారులకు వారికి సిఫారసు చేయబడిన లేదా ఓవర్దికౌంటర్ మందుల విధానాన్ని ట్రాక్ చేయడానికి వీలు కల్పించడమే కాకుండా ముఖ్యమైన వైద్య సమాచారం, చిట్కాలను కూడా అందిస్తుంది. రక్తపోటు, మధుమేహం, పిసిఒఎస్, పిసిఒడి స్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి చికిత్సలో ఉన్న వారికి సాంసంగ్ మందులకు కట్టుబడి ఉండే స్థిరత్వాన్ని ట్రాక్ చేయడంలో ఈ ఫీచర్ సహాయపడుతుంది.